
# లోకులు కాకులు

ఇంద్రగంటి జానకీబాల



ఉలిక్కిపడి లేచాడు పార్థు. భయంగా చుట్టూ చూశాడు. చెవులు రిక్కించి విన్నాడు. ప్రక్కనే చాపమీద అమ్మ నిద్రపోతోంది. ఎక్కడి నుంచో సన్నగా ఏడుపు వినిపిస్తోంది. పదేళ్ళ పార్థుకి భయం వేసింది. వాడు అమ్మ దగ్గరగా జరిగాడు. అమ్మ మెత్తటి పొట్టమీద చెయ్యి వేశాడు. అమ్మ కూడా నిద్ర పోవడం లేదని, వూరికే పడుకుందని వాడికనిపించింది.

"అమ్మా" అన్నాడు నిర్ధారణ కోసం.

"ఊఁ" అంది.

"ఎవరే ఏడుస్తున్నారు?" అన్నాడు.

"మనకెందుకు? పక్కింట్లో అత్తయ్యగారు. నువ్వు పడుకో" అంది పార్థుని దగ్గరకు లాక్కుంటూ. తల్లి జవాబులో 'మనకెందుకు' అన్నమాట పార్థుకి నచ్చలేదు.

"అదేమిటే అమ్మా అలా అంటావు. ఏమైంది?" అన్నాడు మళ్ళీ.

"నీకు నిద్ర రావటం లేదా ఏమిటి? మొదలు పెట్టావు" అంది విసుగ్గా.

"ఊఁ....చెప్పు" అంటూ సాగదీశాడు.

ఇంతలో పక్కింట్లోంచి పిడిగుద్దుల శబ్దం తుపాకీగుళ్ళ వర్షంగా వినిపించింది. పార్థు వణవణ వణికిపోయాడు.

"ఎవరే అమ్మా! ఎవర్నీ కొడుతున్నారు" అన్నాడు.

"ఎవరెవర్ని కొడతారు? మామయ్యగారు అత్తయ్యగార్ని కొడతారు" అంది, అది చాలా సహజమైన విషయంలా.

"ఎందుకు?"

"ఏమో? అయినా మనకెందుకు? ఏదో తప్పు చేస్తే కొడుతూంటారు" అంది.

"తప్పుచేస్తే మాత్రం పెద్ద వాళ్ళని పెద్ద వాళ్ళు కొడతారేవిటి?" అన్నాడు—

"నీవన్నీ కోతి ప్రశ్నలే— మనకెందుకూ అని చెప్పానా— నోరుమూసుకొని పడుకో."

"అదికాదే! ఎందుకే అమ్మా" పార్థు వూరుకోలేదు.

"మొగుడన్నాక పెళ్ళాన్ని కొడతాడు మరి" అంది.

పార్థు కొంచెం సేపు నిశ్శబ్దంగా వుండి—

"నాన్న చచ్చిపోవడమే మంచిదైంది. లేకపోతే నిన్నూ కొట్టేవాడు" అన్నాడు.

"చట్, నోరు మూసుకుని పడుకో" అంటూ వీపు మీద చరిచింది.

మళ్ళీ పక్కింట్లోంచి దెబ్బలు— ఏడుపు. తల్లి నిట్టూర్చింది. పార్థు కోపంగా అటు తిరిగి పడుకున్నాడు.

* * *

"ఏయ్ కనకం- వసేవ్, ఇదిగో నిన్నే. ఏమేవ్ కనకం!- కనకం! లెమ్మంటుంచే" అంటూ తెలుగుదేశంలో భర్త ఎన్ని రకాలుగా భార్యని పిలవగలడో అన్ని రకాలుగానూ పిలిచాడు మొగుడు. అయినా ఆ కనకం వులకలేదు, పలకలేదు.

భయంగా తల్లి వంకే చూస్తున్న పదిహేనేళ్ళ పద్మ వంగి తల్లి వంటి మీద చెయ్యేసి వులిక్కి పడింది. ఆమె కళ్ళల్లో భయం—

"వొళ్ళు చాలా వేడిగా వుంది నాన్నా" అంది. మొగుడి హోదాకి ఏమాత్రం దెబ్బరాకుండా నెమ్మదిగా భార్య దగ్గరగా

వచ్చి. వంటి మీద అలవోకగా చెయ్యివేసి "అబ్బే అదేం లేదులే" అంటూ మళ్ళీ ఒసేవ్, ఏమేవ్, యిదుగో, విన్నే-లాంటి మాటలతో ఆమెని లేపడానికి ప్రయత్నించాడతను.

పద్మ క్రోధంగా తండ్రి వైపు చూసింది. ఆమె ఎదుగుతున్న మనసుకు ఎన్నో విషయాలు అర్థమౌతున్నాయి. భవిష్యత్తు మీద భయంతో, బ్రతుకు మీద విరక్తితో అప్పుడే ఆ పసి హృదయం నలిగిపోవడం మొదలెట్టింది. మొన్నరాత్రి నాన్న అమ్మని అమానుషంగా కొట్టడం ఆమె మనస్సులో చెరగని ముద్రవేసింది. ఆ శబ్దాలు, ఆ అరుపులు, ఏడుపు— అన్నీ ఫుల్‌సౌండ్‌లో ఆన్ చేసిన టేపు రికార్డర్ లా చెవుల్లో హోరెత్తుతున్నాయ్.

పద్మ మళ్ళీ తల్లి వొంటి మీద చెయ్యి వేసింది. అది ఊహించరానంత వేడిగా వుంది. ఏదో స్ఫురించినట్లు పద్మ గజగజ లాడింది.

అమ్మ స్పృహలో లేదనిపించింది. కళ్ళల్లోంచి నీళ్ళు జలజలా రాలాయి. ఒక్క పరుగున పక్కింట్లోకి దూకింది.

"అత్తయ్యగారండీ- అమ్మ ఎంత పిలిచినా లేవడంలేదు నాకు భయమేస్తోంది" అంది ఏడుస్తూ.

ఆమె హడావిడిగా లోపలికొచ్చి కనక మహాలక్ష్మి వంటిమీద చెయ్యేసి చూసి కంగారు పడింది. ఇంతలో ముఖం కడుక్కొని లోపలికొచ్చిన కనకం మొగుడు అటూ యిటూ తచ్చాడి-ఒకే గదికావడం వల్ల ఆడవాళ్ళ మధ్య తనెందుకన్నట్లు బయటికి నడవబోయాడు. పూర్తిగా విషయం క్షణంలో గ్రహించిన పక్కింటి అత్తయ్యగారు "ఒరే పార్థూ, మావయ్య గారితో డాక్టరుగార్ని పిలవమని చెప్పు" అంది.

కనకం మొగుడు బయటకు వెళ్ళగానే యిరుగుపొరుగు చేరారు. అంతా ఒక్కటే మాట "నిన్న ఎలా లేచిందోగాని, ఒళ్ళు హూనమైపోయింది, ఏమైనా మాటొస్తే మాట్లాడుకోవాలిగాని మీదపడి కొడితే ఎలా" అని.

మొగుడికి కూడా భయం వేసి వుంటుంది.భార్య చచ్చిపోతుందని కాదు, చచ్చిపోతే తనమీదకేమైనా వస్తుందేమో నని.

ఇంటి ముందు రిక్షా ఆగింది.

స్పృహలోలేని మనిషిని అతి కష్టం మీద రిక్షాలో చేర్చారు. ఆమెని పొదివి పట్టుకొని పక్కింటి అత్తయ్యగారు రిక్షాలో కూర్చుండగా అది కదిలింది.

పార్థు కసి నిండిన కళ్ళతో మందార చెట్టు గుబురులోంచి తన పిస్టల్ గురి చూసి ఆ మొగుడివైపు పేల్చాడు. అది టప్‌మని బిరడాని బయటకు తన్నింది. ప్లాస్టిక్ వైర్‌కి కట్టబడివున్న ఆ చిన్న బిరడా నీరసంగా వేలాడింది.రిక్షా వెనకాల మొగుడు సైకిలెక్కి వెళ్ళిపోయాడు. పార్థు మనసు శాంతిగా లేదు. తన పిస్టల్ లోంచి గుండువెళ్ళి సరాసరి ఆ మొగుడి వీపులో దిగి'హా'అంటూఅతను ముందుకు పడిపోంటే బాగుండేదని వాడికి అనిపించింది. కానీ తన పిస్టల్లోవున్న ప్లాస్టిక్ బిరడా అసలు ఎక్కడికీ వెళ్ళదు. పెద్ద గొప్పగా 'టప్'మని మాత్రం అంటుంది. పెద్దయ్యాక మంచిది, మూడురూపాయలు కాదు మూడు లక్షలరూపాయలుపెట్టి నిజం పిస్టల్ కొనాలి అని దృఢంగా అనుకున్నాడు పార్థు.

గవర్నమెంటు హాస్పటల్‌లో చేర్పించిన కనకమహాలక్ష్మి పరిస్థితి విషమించిందని సాయంత్రానికల్లా పిల్లల్ని హాస్పటల్‌కు తీసుకెళ్ళారు. వాతం కమ్మేసిన కనకాన్ని వాళ్ళెవరూ రక్షించలేక పోయారు. ఆమె పరిస్థితికి కారణాలు వెదకడానికి డాక్టర్లు కొంత ప్రయత్నం చేసి, విరమించుకున్నారు. అలా విరమించుకోటానికి వాళ్ళు చెప్పే వాదమేమిటంటే-ఆమె ఎలాగూ బతకదు. బ్రతికున్న అతడిమీద నేరం రుజువుచేస్తే అతనికి శిక్షపడితే, పిల్లలగతి ఏమిటి? అని- ఇంతకీ బైటకొచ్చిన విషయం-బ్లీడింగ్ ఎక్కువ అవడంవల్ల-ఆలస్యంగా హాస్పటల్‌కు తీసుకురావడం వల్ల చనిపోయిందని. చుటుపక్కల వాళ్ళందరూ మనసులోనే ముక్కుమీద వేలేసుకున్నారు- చివరికందరూ అనే మాట ఒకటే- "అయినా మన కెందుకులే అతని పెళ్ళాం. అతనిష్టం"-అంతే.

పార్థుకి తన పిస్తోలుమీద గౌరవం పోయింది. ఎందుకూ పనికిరాని ఇలాంటి పిస్తోలు తన దగ్గరున్నందుకు అవమానంగా అనిపించింది వాడికి.

దూరంగా నూతి పళ్ళెం దగ్గర తల్లి కుంకుడుకాయలు కొడుతూంది. రేపు నరక చతుర్దశి. తెల్లారగానే తలమీద నూనెపెట్టి అంటడం మొదలుపెడుతుంది అమ్మ. దీపావళి కూడా ఆ రోజే వచ్చిందట. కనకమహాలక్ష్మి చనిపోయి మూడు రోజులే అయినా ఎవరింట్లోనూ పండగ ఆగిపోవటంలేదు.

పార్థు తీవ్రంగా వాడి బుర్రనంతా వుపయోగించి ఆలోచించాడు. ఒక్క పరుగున తల్లి దగ్గరకెళ్ళాడు. ఆమె తలొంచుకుని కుంకుడు కాయలు కొడుతోంది. లోపలి నుంచి నల్లటి గింజలు విసురుగా అటూ యిటూ పోతున్నాయి.

"అమ్మా పద్మక్కావాళ్ళు పండగ చేసుకోరా" అన్నాడు- నల్లటి గింజలు గుండ్రంగా వున్నవి చూసి, ఏరి నిక్కరు జేబులో వేసుకుంటూ.

"నీ కెందుకురా అన్నీనూ : అవతలికి పో" అంది విసురుగా-

వాడికి తల్లి అలా అనడం ఎప్పుడూ అలవాటే. అయినా వాడికి ఎప్పుడూ కోపమొస్తూనే వుంటుంది. అందుకే దూరంగాపోయి తన పిస్టల్‌లో కుంకుడి గింజపెట్టి దూరంగా గురిచూసినొక్కాడు [నిజానికి వాడు పెద్దగా గురిచూసిందేమీ లేదు. నటన తప్ప] అది వెళ్ళి గోడకి కొట్టుకుని కిందపడింది.పార్థు ఆనందానికి హద్దులేకుండా పోయింది. వాడలా అర గంటసేపు లెక్కలేనన్ని కుంకుడిగింజలు తన పిస్తోల్లోపెట్టి పేల్చాడు. తనకి కనిపించినంత వరకు వాటిని మళ్ళీ ఏరుకొస్తూ రెండింతల వుత్సాహంతోకాల్చుడు కార్యక్రమం సాగించాడు. వాడికి ఆ క్షణంలో తన పిస్తోలుమీద గౌరవం ఏర్పడింది. తనొక యుద్ధభూమిలో సైనికుడిలా అనుకున్నాడు.

పార్థు మళ్ళీ కుంకుడిగింజ పిస్తోలులో బిగించాడు. బాదంచెట్టు గుబురులోకి గురిపెట్టి హీరోలా బటన్ నొక్కాడు. అతి వేగంగా వెళ్ళిన గింజ గుబురులో వున్న కాకికి సూటిగా తగిలింది. అది కావు కావుమంటూ విలవిల్లాడిపోతూ కింద పడిపోయింది! ఒక్క క్షణం పార్థు స్థాణువులా వుండిపోయాడు. అంతలోనే పరుగెట్టుకుని దాని దగ్గర కెళ్ళాడు. దాని

పొట్టలోంచి రక్తం కారుతోంది. విల విల్లాడి పోతోంది. చెంబుడు నీళ్ళుతెచ్చి దానిమీద పోశాడు. కాస్సేపు కొట్టుకుని అది అచేతనంగా వుండిపోయింది. అంతా వచ్చి 'అయ్యో' అన్నారు.

"కాకిగాబట్టి సరిపోయింది. అదే మనిషైతే"....అంటూ కొంతమంది తమకున్న తెలివిని ప్రదర్శించి. ప్రశ్నించి మరీ వెళ్ళిపోయారు. పార్థుకి చాలా బాధ కలిగింది. పక్కింటి అత్తయ్యగారు చనిపోయినప్పటంత బాధా కలిగింది.

తల్లి వచ్చి "అన్నీ వెధవ పనులే. పో లోపలికి" అంటూ కసిరి చేతిలోని పిస్తోలు లాగేసుకుంది.

* * *

కొన్ని వందల కాకులు పెరట్లో గోల చేస్తుండగా పార్థుకి మెలకువ వచ్చింది. అప్పటికే యిద్దరు ముగ్గురు పక్క వాటాల్లోంచి బయటకెళ్ళి కాకులచేత తలమీద చావుదెబ్బలు తిని లోపలికొచ్చారు.

చచ్చిపోయిన కాకి చుట్టూ కొన్ని కావు కావుమంటూ అరుస్తూన్నాయి. కొన్ని కాకులు మనిషన్న వాళ్ళని ఇంట్లోంచి బయటకు రాకుండా పొడిచేస్తున్నాయి.

"ఇదెక్కడి గోలా! కాకిగోల, బయటకు అడుగు పెట్టనీయడంలేదు కాకులు" అంటూ తల్లి కంగారు పడుతుంటే పార్థు కిటికీలోంచి చూశాడు. ఆ యింట్లో మూడు వాటాలవాళ్ళు తెల్లారక ముందే లేచారు. కాని ఒక్కరూ బయటికి రాలేక పోయారు. ఒక్క పనీ కాలేదు. ఒక పెద్ద మనిషి గొడుగేసుకుని బయటకి రాబోతే రెండు కాకులు గొడుగుని తన్నేయటమే కాకుండా అతని బుర్రంతా కాళ్ళతో రామకీర్తనం పాడేశాయి. మాడుపోటు వచ్చి యింట్లోకి పరుగెట్టి మంచమెక్కేశాడాయన.

పార్థు చూస్తున్నాడు. ఆ చిన్నారి మనసులో ఎంతో ఆలోచన రేగుతోంది. ఎంతో బాధ. తన మూలంగా ఆ కాకి చచ్చిపోయింది. ఆ ఒక్క కాకికోసం మొత్తం గుంపంతావచ్చి నానా అల్లరీ చేస్తున్నాయి. కాకులు ఇంత భయంకరంగా వుంటాయని వాడికెప్పుడూ తెలీదు. వాడికి ఒక్కటే పదేపదే అవి పిస్తోంది. 'ఆ కాకులన్నీ 'మనకెందుకులే' అని ఎందుకనుకోవడం లేదూ' అని—

అందీ అందని ఆలోచనల మధ్య మరోటి కూడా వాడికనిపిస్తోంది. 'ఈ కాకులన్నీ ఒక్కసారిపోయి కనకం అత్తయ్య మొగుడిమీద పడి పొడిచేస్తే బాగుండును'- అని.

అంతా ఇళ్ళల్లోనే మగ్గిపోయారు. ఆ రోజే అమావాస్య రావడంతో అదే సాయంత్రం దీపాలు పెట్టాలనీ బాణసంచా కాల్చాలనీ అనుకున్నారు. కాని అందరూ సాయంకాలానికి మానసికంగా, శారీరకంగా విపరీతంగా అలసిపోయారు.

కాకులు బాగా చీకటి పడేవరకు గోల చేసి వెళ్ళిపోయాయి. అందరూ గుప్పెట్లో ప్రాణాలు పెట్టుకుని బయటకొచ్చారు. చుట్టుపక్కల దీపావళి జరుగుతున్నా ఆ యింట్లో అంతా నీరసంగా గుమ్మాల్లో కూర్చుండి పోయారు.

"మూడునాళ్ళ క్రితం శవం వెళ్ళిన ఇంట్లో పండగేవిటి" అన్నారు అవ కాశవాదులు.

